## రేగొండలో గుప్పుమంటున్న గంజాయి

- అర్ధరాత్రి వరకు మత్తులో జోగుతున్న యువత
- చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్న అధికారులు

రేగొండ, ఏప్రిల్ 20 : మండల కేంద్రం తోపాటు పలు గ్రామాల్లో గంజాయి సిగరెట్లు, గంజాయి అమ్మకాలు జోరుగా సాగుతున్నట్లు ప్రచారమవుతోంది. దీంతో యువత గంజాయి మత్తు బారిన పడి పలు నేరాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఈ దందాకు అధికారుల అండదండలు, అధికార పార్టీ యువనేతల భాగస్వామ్యం పుష్కలంగా ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రంతోపాటు రంగయ్యపల్లి, మడ్తపల్లి, పొనగల్లు, తిరుమలగిరి, నారాయణపురం, గోరికొత్తపల్లి, జగ్గయ్యపేట గ్రామాల్లో జోరుగా అమ్మకాలు సాగుతున్నట్లు తెలిసింది. రేగొండ, రంగయ్యపల్లి, తిరుమలగిరికి చెందిన వారు గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నట్లు సమాచారం. పాండవుల గుట్టలు, పొనగల్లు శివారు ప్రాంతాలు అడ్డాగా ఈ దందా కొనసాగుతున్నట్లు వినికిడి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి గంజాయి సిగరెట్లు కొనుగోలు చేసి అక్కడే దమ్ముకొట్టి వెళ్తున్నట్లు ప్రచారంలో ఉంది. అర్ధరాత్రి వరకు మత్తులో యువత బైకులపై విచ్చలవిడిగా తిరుగుతుండడంతో సామాన్యులు బయటికి రావడానికి భయపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గంజాయి అమ్మకాలపై ఉక్కుపాదం మోపాలని పలువురు కోరుతున్నారు.

## రైతు కుటుంబానికి బీఆర్ఎస్ చేయూత

**రూ.40వేల ఆర్థికసాయం పంపిన కాకులమర్రి**

మంగపేట, ఏప్రిల్ 20 : మండలంలోని మల్లూరు గ్రామ పంచాయతీ పరిధి మొట్లగూడెంకు చెందిన యాలం నర్సింహారావు ఇటీవల వడగండ్లు కురిసి పంట నష్టపోవడంతో ఆత్మహత్యకు పాల్పడిన విషయం విధితమే. బాధిత కుటుంబాన్ని ఆదివారం బీఆర్ఎస్ మండల కమిటీ నాయకులు పరామర్శించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు పంపించిన రూ.40వేలను మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ బాధిత రైతు కుటుంబానికి అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ అండదండలు ఎల్లవేళలా ఉంటాయని భరోసా ఇచ్చారు. పీఏసీఎస్ చైర్మన్ తోట రమేశ్, జిల్లా నాయకుడు తాటి కృష్ణ, మల్లూరు దేవస్థాన మాజీ చైర్మన్ నూతిలకంటి ముకుందం, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ కాడబోయిన నరేందర్, చిట్టిమల్ల సమ్మయ్య, గాదె శ్రీనివాసాచారి, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉడుగుల శ్రీనివాస్ యాదవ్, చల్లగురుగుల తిరుపతి, కోరెం నర్సింహులు, లల్లె జనార్దన్, నాలి సూర్యనారాయణ, అప్జల్ పాషా, వేణు, సోషల్ మీడియా వారియర్స్ గుడివాడ శ్రీహరి, పూజారి సతీశ్ పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న లక్ష్మీనారాయణ

## 'ఒక ప్రస్థానం' పుస్తకావిష్కరణకు తరలిన నాయకులు

మహదేవపూర్, ఏప్రిల్ 20 : మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ జన్మదినాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ జలవిహార్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన కొప్పుల ఈశ్వర్ 50ఏళ్ల రాజకీయ ప్రస్థానానికి సంబంధించి రచించిన 'ఒక ప్రస్థానం' పుస్తకావిష్కరణ సభకు ఆదివారం బీఆర్ఎస్ శ్రేణులు తరలివెళ్లారు. మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాసరావు, పూదరి సత్యనారాయణగౌడ్, మందల రాజిరెడ్డి, గుజ్జుల రాజిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వెళ్లారు. ఈ పుస్తకాన్ని మాజీ సీఎం కేసీఆర్ ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ముఖ్యనేతలు, పలువురు రాజకీయ సినీరంగ ప్రముఖులు పాల్గొన్నారు.



సభకు తరలిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, బీఆర్ఎస్ నాయకులు

## మేడారంలో భక్తుల సందడి



తాడ్వాయి, ఏప్రిల్ 20 : వనదేవతలైన మేడారం సమ్మక్క, సారలమ్మలను ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. సెలవురోజు కావడంతో తెలంగాణలోని పలు జిల్లాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. మొదట జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి కల్యాణకట్ట వద్ద తల్లులకు తలనీలాలు సమర్పించారు. అమ్మవార్ల గద్దెల వద్దకు చేరుకుని గిరిజన సంప్రదాయ పద్ధతిలో మొక్కులు చెల్లించారు. తల్లులకు యాటపోతులు సమర్పించారు. గద్దెల పరిసరాల్లో విడిది చేసి వంటలు చేసుకుని కుటుంబ సమేతంగా విందు భోజనాలు చేశారు.

# రజతోత్సవ సభకు భారీగా తరలాలి

**బీఆర్ఎస్ పార్టీ మండలాల అధ్యక్షుల పిలుపు**

గణపురం, ఏప్రిల్ 20 : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు భారీగా తరలిరావాలని పార్టీ పలు మండలాల అధ్యక్షులు పిలుపునిచ్చారు. గణపురం మండలం కొండాపూర్, వెంకటేశ్వర్లపల్లి ముఖ్యకార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. పార్టీ మండల అధ్యక్షుడు మోతె కరుణాకర్‌రెడ్డి మాట్లాడారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే పార్టీ ఆవిర్భావ దినోత్సవ మహాసభకు అన్ని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యేలా నాయకులు కృషి చేయాలని కోరారు.

**జన సమీకరణకు సైనికుల్లా పనిచేయాలి**

రేగొండ : బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని గోరికొత్తపల్లి మండల అధ్యక్షుడు ఎంపీ హమీద్ పిలుపునిచ్చారు. పార్టీ ఏర్పడి 25 ఏళ్లు అవుతున్న సందర్భంగా ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి జన సమీకరణ చేస్తున్నట్లు తెలిపారు. కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. నాయకులు కామగంటి శ్రీనివాస్, ధనుంజయ, సుధాకర్ ఉన్నారు.



ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ గణపురం మండల అధ్యక్షుడు మోతె కర్ణాకర్‌రెడ్డి

### దండులా కదలాలి

**బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్**



చిట్యాల : హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తిలో ఈ నెల 27న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ సాధనే ధ్యేయంగా ఆవిర్భవించిన బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 ఏళ్లు అవుతోందని పేర్కొన్నారు. సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ గ్రామాన ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు దండులా కదలి రావాలని కోరారు.

## వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ అభివృద్ధికి సహకరిస్తా

- భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి
- విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్సీ సిరికొండ



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదనాచారి

కృష్ణకాలనీ, ఏప్రిల్ 20 : జిల్లా కేంద్రంలోని కారల్‌మార్క్స్ కాలనీలో ఆదివారం నిర్వహించిన శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన చేయడం అభినందనీయమన్నారు. వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయసహకారాలు అందిస్తానని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. అలాగే ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భూపాలపల్లి అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, మున్సిపల్ మాజీ కో ఆప్షన్ మెంబర్ బేతోజు వజ్రమణి బీబీచారి, జాగృతి జిల్లా అధ్యక్షుడు మాడ హరీశ్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు బుర్ర రాజు, నాయకులు రఘుపతిరావు, రాజు, శ్రీకాంత్ పటేల్, యుగేంద్రచారి, రాజ్‌కుమార్, ఖలీద్, పూర్ణయాదవ్, ముద్దసాని కిరణ్, తాళ్లపెల్లి శశికాంత్‌గౌడ్, సుంకరి గోవర్ధన్, గొడుగు శ్రీకాంత్, తిప్పని రంజిత్, భారతమ్మ, గంగా, రజిత, వాణి, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## కరాటే జిల్లా రిప్రజంటేటివ్‌గా రాజు



రాజుకు నియామకపత్రం అందిస్తున్న భరత్‌శర్మ

ములుగురూరల్, ఏప్రిల్ 20 : కరాటే అసోసియేషన్ ములుగు జిల్లా రిప్రజంటేటివ్, అఫీషియల్ జడ్జిగా అజ్మీరా రాజు నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కరాటే ఇండియా ఆర్గనైజేషన్ జాతీయ అధ్యక్షుడు భరత్‌శర్మ నియామక పత్రాన్ని అందజేశారు. అజ్మీరా రాజు గిరిజన సంక్షేమ శాఖలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తూ కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించారు. అనేక టోర్నమెంట్లలో పాల్గొంటూ, గిరిజన విద్యార్థులకు కరాటే నేర్పిస్తూ అనేక మంది విద్యార్థులను జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిద్దారు.

## ఆదివాసీ చట్టాల అమలులో నిర్లక్ష్యం



మాట్లాడుతున్న పూనెం సాయి

వెంకటాపురం(నూగూరు), ఏప్రిల్ 20 : ఆదివాసీ చట్టాలను అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి ఆరోపించారు. మండలకేంద్రంలో ఆదివారం నిర్వహించిన గోండ్వానా సంక్షేమ పరిషత్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీ ఉద్యోగులు అక్కడి చట్టాలను గౌరవిస్తూ ఆదివాసీల అభివృద్ధికి పాటుపడాలని అన్నారు. ఆదివాసీ చట్టాలను అధికారులు పటిష్ఠంగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చంటి, నరేశ్ పాల్గొన్నారు.

## నూతన జిల్లా కమిటీ ఎన్నిక

వెంకటాపురం(నూగూరు), ఏప్రిల్ 20 : ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా నూతన కమిటీని మండలకేంద్రంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తాటి నాగరాజు, గౌరవ అధ్యక్షుడిగా పీర్ల మల్లికార్జున్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పోలెబోయిన కృష్ణారావు, ఉపాధ్యక్షులుగా సూరిబాబు, పాయం రాకేశ్, బొగ్గుల సమ్మయ్య, సంయుక్త కార్యదర్శిగా బొగ్గుల సమ్మయ్య, ప్రచార కార్యదర్శిగా చీమల రామనాథం, కోశాధికారిగా ఊకె జగన్, కార్యదర్శిగా బొగ్గుల నారాయణ, వెంకటరత్నం, ప్రవీణ్, శ్యామల్, వెంకటేశ్వర్లు, శేషును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షుడు ఉయిక శంకర్ పాల్గొన్నారు.



కృష్ణకాలనీ : పాల్గొన్న పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు



ములుగు రూరల్ : సమ్మేళనంలో విద్యార్థులు, గురువులు

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కృష్ణకాలనీ, ఏప్రిల్ 20 : భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సిద్ధార్థ జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో 2007 నుంచి 2013 వరకు ఇంటర్మీడియట్, డిగ్రీ విద్య అభ్యసించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా జరిగింది. చాలాకాలం తర్వాత కలుసుకున్న మిత్రులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పుష్పగుచ్ఛాలు చల్లుతూ ఆనంద కోలాహల నడుమ సభపైకి ఆహ్వానించారు. నాటి తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో సిద్ధార్థ కళాశాల ఫౌండర్ రాజేశ్వర్‌రావు, ప్రిన్సిపాల్ స్వామి, కరస్పాండెంట్ బాలూనాయక్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భానుప్రకాశ్, అధ్యాపకులు రవీందర్, సురేశ్, శేఖర్, ఆనంద్, శ్రీనివాస్, హరీశ్, పూర్వ విద్యార్థులు పాలకుర్తి రఘుపతిగౌడ్‌తోపాటు మరో 60మంది పాల్గొన్నారు.

**అ'పూర్వ' సమ్మేళనం**

ములుగు రూరల్ : మల్లంపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో 1999–2000 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి హెచ్ఎం గోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, వెంకటాచలం, సుకురుద్దీన్, రామ్, తోట రాజమౌళిలను శాలువాలతో సత్కరించారు. చిన్ననాటి మధు క్షణాలను గుర్తుచేసుకుని ఉల్లాసంగా గడిపారు.

## ఘనంగా ఈస్టర్ వేడుకలు

మహదేవపూర్(కాళేశ్వరం), ఏప్రిల్ 20 : మండలంలో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని బెగ్లూర్, రాపల్లికోట పలు గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రన్ ఫర్ జీసస్ పేరుతో శాంతి ర్యాలీ చేపట్టారు. పాస్టర్లు జోసెఫ్, సురేశ్, ప్రకాశ్, సంఘ పెద్దలు, విశ్వాసులు, జీసస్ లవ్స్ ప్రేయర్ టీం సభ్యులు, క్రిస్టియన్లు పాల్గొన్నారు.



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రిస్టియన్లు

## సర్కారు దవాఖాన ఆవరణలో పందులు, పశువుల సంచారం

- పర్యవేక్షణ కరువై అస్తవ్యస్తం
- ఇబ్బందులు పడుతున్న రోగులు



ప్రభుత్వ దవాఖాన ఆవరణలో పందులు

మహదేవపూర్, ఏప్రిల్ 20 : మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక దవాఖాన పందులు, పశువులకు అడ్డాగా మారింది. మహదేవపూర్, కాటారం, మహాముత్తారం, మల్హర్, పలిమెల మండలాల నిరుపేదలకు పెద్ద దిక్కుగా ఉన్న స్థానిక సర్కార్ దవాఖానను పట్టించుకునేవారే కరువయ్యారు. దవాఖానకు వచ్చే రోగులకు పందులు, పశువులు దర్శనమిస్తున్నాయి. కనీసం వాటిని తరిమే వారు లేకపోవడం గమనార్హం. ఆస్పత్రిలో రోగులకు మెరుగైన సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోంది. సరైన డ్రైయినేజీ లేక మురుగునీరు ఆస్పత్రి ఆవరణలో నిలిచి పరిసరాలు కంపుకొడుతున్నాయి. నిత్యం పశువుల సంచారంతో ఆస్పత్రికి వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపమే కారణంగా తెలుస్తున్నది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి దవాఖానలో మెరుగైన సౌకర్యాలు కల్పించి, పశువుల సంచారాన్ని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## తొలిరోజు ప్రశాంతంగా ఓపెన్ పరీక్షలు

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 20 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మూడు పరీక్షా కేంద్రాల్లో మొదటి రోజు ఆదివారం నిర్వహించిన సార్వత్రిక విద్యాపీఠం (టాస్, ఓపెన్ స్కూల్ సొసైటీ) ఇంటర్, పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం రాజేందర్, ప్రభుత్వ పరీక్షల నియంత్రణ అధికారి రవీందర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భూపాలపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల, జంగేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ఇంటర్ పరీక్షకు 369మంది విద్యార్థులకుగాను 346మంది హాజరయ్యారు. భూపాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో నిర్వహించిన పదో తరగతి పరీక్షకు 197 మంది విద్యార్థులకుగాను 172మంది హాజరైనట్లు తెలిపారు.

## వడదెబ్బతో చత్తీస్‌గఢ్ కూలీ మృతి

వెంకటాపురం(నూగూరు), ఏప్రిల్ 20 : మండల పరిధిలోని వీరభద్రవరంలో వడదెబ్బతో చత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వలస కూలీ మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన పూనెం నన్ను(32) మిర్చి తోటలో పనిచేసేందుకు వచ్చాడు. ఆదివారం కూలీ పని చేస్తున్న సమయంలో వడదెబ్బకు గురై అక్కడికక్కడే మృతిచెందినట్లు స్థానిక పోలీసులు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

వాజేడు, ఏప్రిల్ 20 : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన ఆదివారం రాత్రి మండలంలోని బొమ్మనపల్లి – ఎడ్జర్లపల్లి మధ్య జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ఎడ్జర్లపల్లికి చెందిన మంచర్ల నర్సింహారావు, బద్ది వెంకటేశ్ ద్విచక్రవాహనంపై బొమ్మనపల్లికి వెళ్లారు. తిరిగి వస్తుండగా బైక్ అదుపుతప్పి ఇద్దరు కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 పైలట్ కుప్పిలి రాధాస్వామి, ఈఎంటీ ప్రవీణ్ ఘటనా స్థలానికి చేరుకొని చికిత్స కోసం వారిని ఏటూరునాగారం ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

## అక్రమ భవన నిర్మాణాలను అరికట్టాలి



మాట్లాడుతున్న యూవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు అక్కల బాపు

మహదేవపూర్(కాటారం), ఏప్రిల్ 20 : కాటారం మండల కేంద్రంతోపాటు మండలంలో జరుగుతున్న అక్రమ భవన నిర్మాణాలను అరికట్టాలని భారత ఐక్య యువజన సమాఖ్య (యూవైఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అక్కల బాపు డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని పోతులవాయి శివారులో అక్రమ భవన నిర్మాణాలకు తుడుందెబ్బ నాయకులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కొంతకాలంగా మండలంలోని అన్ని గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధుల అండదండలతో ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. కోట్ల రూపాయలు విలువ చేసే భూములు కబ్జాకు గురవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తుడుందెబ్బ జిల్లా నాయకులు దెయ్యం పోచయ్య, ఎంసీపీఐ మహిళా నాయకురాలు రాజమణి, కోమ రమ ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**PLOT FOR SALE**

★వరంగల్ హైవే రఘునాథ్‌పల్లికి దగ్గరలో 2 లక్షలకే 121 Sq.yds. Plots అన్ని డెవలప్‌మెంట్స్‌తో కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్: 8523041059.

NT-329891

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

## దేవాదుల ఎత్తిపోతల ఒక మోటర్ బంద్

కన్నాయిగూడెం, ఏప్రిల్ 20 : మండలంలోని దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టులోని రెండు మోటర్లతో గోదావరి నీటి పంపింగ్ కొనసాగుతుండగా ఆదివారం ఒక మోటర్ బంద్ చేశారు. ఫేజ్–2లోని ఒక మోటర్ ద్వారా రోజుకు 247క్యూసెక్కుల నీటిని భీంఘనపురం రిజర్వాయర్‌లోకి తరలిస్తున్నట్లు నీటిపారుదల శాఖ డీఈ శరత్, ఏఈఈ సాయిరాం తెలిపారు. కాగా దేవాదుల వద్ద గోదావరి నీటిమట్టం పూర్తిగా తగ్గుతూ 72.10 మీటర్లకు చేరడంతో ఫేజ్–3 లోని మోటర్లకు నీరు అందడంలేదని తెలిపారు.

## ముదిరాజ్ సమాజ్ జెండా ఆవిష్కరణ

గోవిందరావుపేట, ఏప్రిల్ 20 : మండల కేంద్రంలో ముదిరాజ్ సమాజ్ జెండాను మెపా రాష్ట్ర అధ్యక్షుడు దారం యువరాజు ఆదివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ముదిరాజ్‌లను బీసీ–'డీ' నుంచి బీసీ–'ఏ'లోకి మార్చాలని అన్నారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు సదయ్య, వెంకన్న, రవీందర్, సురేశ్, హరికుమార్, అనిల్ పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న యువరాజు

## ఎంజేపీ ప్రవేశ పరీక్షకు 362 మంది హాజరు

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 20 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని నాలుగు మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలల్లో ఆరవ, ఏడవ, ఎనిమిదవ, తొమ్మిదవ తరగతిలో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి ఆదివారం లింగాల క్రాస్‌రోడ్, మొగుళ్లపల్లి జ్యోతిరావు పూలే పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించినట్లు జిల్లా కన్వీనర్ ఏ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 394మంది దరఖాస్తు చేసుకోగా 362మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎం రాజేందర్ పరీక్ష కేంద్రాలను సందర్శించారు. పరీక్ష నిర్వహణపై, పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలపై డీఈవో సంతృప్తి వ్యక్తం చేసినట్లు వెంకటేశ్వర్లు తెలిపారు.

# వక్ఫ్‌బోర్డు చట్ట సవరణను వెనక్కి తీసుకోవాలి

**బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు షేక్ ఖలీద్**





నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న షేక్ ఖలీద్

ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

కృష్ణకాలనీ, ఏప్రిల్ 20 : వక్ఫ్‌బోర్డు చట్టాన్ని సవరిస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల నూతనంగా తీసుకువచ్చిన కొత్త చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు షేక్ ఖలీద్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన వక్ఫ్‌బోర్డు చట్ట సవరణను వ్యతిరేకిస్తూ ఆదివారం జిల్లా కేంద్రంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఖలీద్ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు అంటే మత సంబంధిత సంస్థల నిర్వహణ కోసం శాశ్వత విరాళ భూమి అని తెలిపారు. కొత్త చట్టం నిబంధనల ప్రకారం ముస్లిమేతరులు భూమిని విరాళంగా ఇవ్వలేరని, ముస్లింలు కూడా విరాళంగా ఇవ్వాలంటే కనీసం ఐదేళ్లకు పైగా ముస్లిం మతాన్ని అనుసరించిన వారై ఉండాలన్నారు. భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 26 మతపరమైన వ్యవస్థలను స్వతంత్రంగా నిర్వహించుకునే హక్కు కల్పించిందన్నారు. ఇందుకు విరుద్ధంగా తీసుకువచ్చిన కొత్త చట్టాన్ని ముస్లింలంతా ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారన్నారు. తామంతా మౌలానా అబుల్ కలాం ఆజాద్ వారసులమని, ఇండియన్ ఫస్ట్–ముస్లిం లేటరని నినదించిన వాళ్లం తామేనన్నారు. మౌంట్ బాటన్ ప్రణాళిక అనంతరం దేశ విభజన జరిగిన సమయంలో పాకిస్థాన్ విడిపోతే తమ పూర్వీకులు ఇదే భారతదేశ మట్టిలో పుట్టి, కలిసిపోయిన దేశ భక్తులమన్నారు. ప్రస్తుతం సుప్రీంకోర్టులో విచారణలో ఉన్నందున న్యాయం జరుగుతుందనే పూర్తి విశ్వాసం తమకుందన్నారు. జిల్లాలోని ముస్లింలు పాల్గొన్నారు.

**ముస్లింల ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర**

కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రతిపాదించిన వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. వక్ఫ్‌బోర్డు నూతన సవరణను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ముస్లిం సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే సత్యనారాయణరావు ముఖ్యఅతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభి, ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కేంద్రం చట్ట సవరణను పునఃపరిశీలించి వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముస్లిం సంఘాల నాయకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## గోదావరి ఇసుకలో అస్థిపంజరం లభ్యం



28వ పిల్లర్ వద్ద గుర్తించిన మహిళ అస్థిపంజరం

వాజేడు, ఏప్రిల్ 20 : మండలంలోని పూసూరు ముళ్లకట్ట గోదావరి బ్రిడ్జి కింది భాగంలోని 27వ పిల్లర్‌కు సమీపంలో ఆదివారం స్థానికులకు మహిళ అస్థిపంజరం కనిపించింది. దీంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. వాజేడు, ఏటూరునాగారం రెవెన్యూ, పోలీసు, వైద్య సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని అస్థిపంజరం మహిళదిగా గుర్తించారు. తలకు గుడ్డకట్టి ఉండడంతోపాటు పింక్ కలర్ చీర ధరించి ఉంది. అక్కడ పొగాకు, సున్నం డబ్బా లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిర్వహించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎన్ రాజ్‌కుమార్ తెలిపారు. చత్తీస్‌గఢ్‌కు చెందిన మహిళగా పోలీసులు అనుమానిస్తున్నారు. సహజ మరణమా? ఎవరైనా హత్య చేసి ఇక్కడ పడేశారా? గోదావరి దాటి వచ్చిన క్రమంలో ఎండదెబ్బ తగిలి మృతిచెంది ఉంటుందా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

## చికిత్స పొందుతూ ఒకరి మృతి


రేగొండ, ఏప్రిల్ 20 : పరకాల–భూపాలపల్లి జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డుప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న తాళ్లపల్లి సమ్మయ్య (55) ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రేగొండ మండలం మడుత్తపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి సమ్మయ్య అవసర నిమిత్తం ద్విచక్ర వాహనంపై శనివారం పరకాలకు వెళ్లాడు. ఈ క్రమంలో పరకాల–భూపాలపల్లి జాతీయ రహదారిపై దమ్మన్నపేట క్రాస్ సమీపంలో పరకాల వైపు వెళ్తున్న ఇసుక లారీ అతివేగంగా వచ్చి వెనుక నుంచి ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో సమ్మయ్య తీవ్రంగా గాయపడగా ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



మాట్లాడుతున్న జీపీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్

## జీపీ కార్మికుల బకాయిలు విడుదల చేయాలి

మహదేవపూర్(కాళేశ్వరం), ఏప్రిల్ 20 : జీపీ కార్మికుల బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాదుల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో జీపీ కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 51జీవోను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు భాషా, మండల గౌరవ అధ్యక్షుడు వంగల రాజమౌళి, మండల అధ్యక్షుడు ఠాకూర్ కేసర్ సింగ్, కార్యదర్శి వేమునూరు రవీందర్‌రెడ్డి, మండల ఆర్గనైజర్ జిమ్మడ రాజబాబు, కోశాధికారి జాడి నరసింహులు, కారోబార్లు, పంపు ఆపరేటర్లు, ట్రాక్టర్ డ్రైవర్లు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ షోయబ్ అహ్మద్ ఖాన్

## కిడ్నీ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలి

ఏటూరునాగారం, ఏప్రిల్ 20 : కిడ్నీ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోందని, కిడ్నీ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలని ప్రముఖ కిడ్నీ వైద్య నిపుణుడు డాక్టర్ షోయబ్ అహ్మద్‌ఖాన్ సూచించారు. మండల కేంద్రంలోని గిరిజన బాలికల డిగ్రీ కళాశాలలో ఆదివారం కిడ్నీ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన హాజరై మాట్లాడుతూ వ్యాధులు రాకుండా ఉండేందుకు రోజువారీగా తీసుకోవాల్సిన ఆహారం తాజాగా ఉండేలా చూసుకోవాలన్నారు. రోజూ మూడు లీటర్ల వరకు నీరు తాగాలన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలన్నారు. ఏడాదికోసారి కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. బీపీ, షుగర్ కంట్రోల్‌లో ఉండేలా చూసుకోవాలన్నారు. అవగాహన కార్యక్రమంలో స్థానిక డయాలసిస్ సెంటర్ ఇన్‌చార్జి సాయికుమార్, టెక్నీషియన్ పవన్, అబ్దుల్ ఖాదర్, అఖీబ్ పాల్గొన్నారు.